

భక్తితో మిలాద్ ఉన్ నబీ



జష్నే మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకుని శుక్రవారం మచిలీపట్నం, గుడివాడలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మత పెద్దలు, యువకులు, మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



ప్రతిభకు పురస్కారం

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఏ.కన్వెన్షన్ హాల్లో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కలిసి సీఎం చంద్రబాబు.. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకుంటున్న జిల్లాకు చెందిన కె.ఉదయ్‌కుమార్ (నాగాయలంక జెడ్పీహెచ్ఎస్), టి.చంద్రశేఖరరావు (కోసూరివారిపాలెం ఎంపీపీ స్కూల్), వై.యశోద లక్ష్మి (వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం), బీవీఎస్ఎల్ పద్మావతి (దోసపాడు జెడ్పీహెచ్ఎస్), వి.సుందరలక్ష్మి (మచిలీపట్నం లేడీయాంప్తిల్ కాలేజీ)

ఇసుక మేత

నిబంధనలను పట్టించుకోరు.. ఎన్‌జీటీ ఆదేశాలున్నా లెక్కచేయరు.. అక్రమంగా మైనింగ్ చేయటం.. సొంత స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసుకోవటం.. సొంత ధరలను నిర్ణయించటం.. ప్రభుత్వ స్టాక్ పాయింట్లను చెరపట్టి పాత వే బిల్లులతో ఇసుక అక్రమ వ్యాపారం సాగించడం.. జిల్లాలో చోటుచేసుకుంటున్న ఇసుక అక్రమాలివి. అధికార యంత్రాంగాలను మంచి చేసుకుని అక్రమార్కులు సాగిస్తున్న ఈ అరాచకాలు నేడు శ్రుతిమించుతున్నాయి.

ఇసుక స్టాక్ పాయింట్లలో యథేచ్ఛగా దందా

కృష్ణానదిలో అక్రమ తవ్వకాలు.. సొంత పాయింట్లకు తరలింపు

- ఎక్కడికక్కడ ప్రైవేట్ పాయింట్ల ఏర్పాటు.. కొన్నిచోట్ల డంప్
- అధికారులను ప్రసన్నం చేసుకుని ఇష్టానుసారంగా అక్రమాలు
- నిబంధనలు పట్టించుకోరు.. ఎన్‌జీటీ ఆదేశాల ఊసెత్తరు..!
- అధికార స్టాక్ పాయింట్ల నుంచి పాత వే బిల్లులతో రవాణా
- క్యూఆర్ కోడ్‌తో గుట్టురట్టు అవుతున్నా పట్టని యంత్రాంగం



పాత వే బిల్లులతో చోడవరం స్టాక్‌యార్డు నుంచి తరలిస్తున్న ఇసుక (ఇన్‌సెట్‌లో) పాత వే బిల్లు


AP SAND MANAGEMENT SYSTEM
Driver Copy
Order Id
Trip No
Customer Name
Customer Mobile No
Sand Quantity:
Sand Supply Point: Name Chodavaram Stock...
Dispatch Date: 04-09-2025 04:04:16
Driver Name
Driver Mobile No
Vehicle No
Address: Palnadu, Macherla, Macherla (M) ard No.1, NEHRUNAGAR, Macherla

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/తోట్లవల్లూరు) : కృష్ణాజిల్లాలో ప్రస్తుతం చోడవరం, మద్దూరు, నార్త్ వల్లూరు, రొయ్యూరు (2), పటమటలంక, శ్రీకాకుళం.. ఇలా ఏడుచోట్ల అధికారికంగా ఇసుక స్టాక్ పాయింట్లు నిర్వహిస్తున్నారు. తోట్లవల్లూరు మండల పరిధిలో మాత్రం ఇసుక అక్రమాలు భారీగా జరుగుతున్నాయి. కృష్ణానదిలో వరదలకు ముందు భారీగా ఇసుకను తోడారు. ఈ ఇసుకను రొయ్యూరు, వల్లూరు పాలెంలోని ప్రైవేట్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిల్వ చేశారు. ఒక రకంగా ఇవి ప్రైవేట్ స్టాక్ పాయింట్లుగా మారాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు అక్టోబరు 15 వరకు కృష్ణానదిలో ఇసుకను తోడటానికి వీల్లేదు. అయినా అక్రమార్కులు వరదల ముందు రాత్రిపూట ఎక్స్‌కవేటర్ల ద్వారా భారీగా తవ్వి, టిప్పర్ల ద్వారా ప్రైవేట్ స్టాక్ పాయింట్లకు తరలించారు. చోడవరం, ఐనవూరులో డంప్ ఏర్పాటు చేశారు.

చర్యలు శూన్యం


కృష్ణానదిలో తవ్వకాలు జరపటం ఒక ఎత్తయితే, అనధికారిక స్టాక్ పాయింట్లు, ఇసుక డంప్‌ల నుంచి భారీగా ఇసుకను తరలించటం మరో ఎత్తు. ఈ వ్యవహారాలు స్థానిక ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు అధికారులకు తెలిసినా మిన్నకుండిపోతున్నారు. ఆయా శాఖలకు వాటాలు వెళ్తుండటం వల్లే ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్న ఆరోపణలూ లేకపోలేదు. రొయ్యూరులోని అధికారిక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను బయటకు తరలిస్తున్నా.. అందులోని పరిమాణంలో మాత్రం పెద్దగా మార్పు ఉండట్లేదు. వందల సంఖ్యలో లారీల్లో తరలిస్తున్న ఇసుకంతా ఎక్కడిది? అనే అనుమానం కలుగుతోంది. వరదలకు ముందే కృష్ణానదిలో అనధికారికంగా తవ్వి ఉండాలి. లేదా

మిగతా 6లో..

కొండంత నిఘా

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రి చుట్టూ సీసీఎస్ భద్రత

- నేరాల కట్టడికి ప్రణాళిక సిద్ధం చేసిన పోలీసులు
- కొండ చుట్టూ 35 హాట్‌స్పాట్ల గుర్తింపు
- గత ఉత్సవాల కంటే పెరిగిన పాయింట్లు



ఇంద్రకీలాద్రిపై దొంగలు ఎక్కువగా సంచరించే ప్రాంతం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దసర శరన్నవరాత్రుల్లో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చేవారు భక్తులైతే.. దర్శనానికి వచ్చినట్టుగా వ్యవహరిస్తూ చేతివాటాలు చూపించేవారు దొంగలు. భక్తుల హడావిడిని అవకాశంగా మార్చుకుని కనిపించిన వస్తువులను మాయం చేస్తుంటారు. వారికి అడ్డుకట్ట వేయడానికి సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందుకు అనుగుణంగా రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి చుట్టుపక్కల మొత్తం 35 హాట్‌స్పాట్లను అధికారులు గుర్తించారు. గత శరన్నవ రాత్రుల్లో గుర్తించిన హాట్‌స్పాట్ల కంటే ఈ ఏడాది వాటి సంఖ్య పెరిగింది. గతంలోని ఘటనలను బేరీజు వేసుకుని ఈ పాయింట్లను పిన్ చేశారు.

వినాయకుడి ఆలయం నుంచి..

ఈ ఉత్సవాల్లో కెనాల్‌రోడ్డులోని వినాయకుడి ఆలయం నుంచి క్యూలైన్లు ప్రారంభమవుతాయి. ఈ లైన్లలో వెళ్లిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని శివాలయం వైపున ఉన్న మెట్లమార్గం నుంచి కనకదుర్గానగర్‌లోకి ప్రవేశిస్తారు. కొండ ఎక్కే ప్రాంతం కంటే దిగే ప్రాంతంలో రద్దీ ఎక్కువ ఉంటుంది. ఇక్కడే అన్నప్రసాద వితరణ జరుగుతుంది. శరన్నవరాత్రులు ఆరంభం రోజే స్థానిక దొంగలు, స్థానికేతర దొంగలు ఇంద్రకీలాద్రి చుట్టూ వాలిపోతారు. కొంతమంది క్యూలైన్లలో నడుచుకుంటూ కొండపైకి వస్తుంటారు. అవకాశం దొరికినప్పుడు భక్తులకు సంబంధించిన ఏదో ఒక వస్తువును మాయం చేస్తారు. పని పూర్తికాగానే క్యూ మధ్యలో నుంచి బయటకు వచ్చేస్తుంటారు. కొంతమంది శివాలయం వైపున ఉన్న మెట్లమార్గం వద్ద కాపుకాసి భక్తులను అనుసరిస్తూ చోరీలు చేస్తారు. గత ఏడాది పోలీసులకు అందిన ఫిర్యాదుల్లో సెల్‌ఫోన్ల చోరీకి

మిగతా 6లో..



గురుపూజోత్సవం

మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 23 మంది టీచర్లను సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జేసీ గీతాంజలిశర్మ, ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా తదితరులు

8

తిరకాసుల తహసీల్దార్లు

కొంచెం పరపతి, భారీగా ఆర్థిక స్థోమత ఉంటే చాలు జిల్లాలోని రెవెన్యూ విభాగంలో ఏదైనా సాధించుకోవచ్చు. గుట్టుచప్పుడు కాకుండా ఆర్థికపరమైన కథ నడిపితే కోరుకున్న మండలంలో అర్హత లేకున్నా పోస్టింగ్ పొందవచ్చు. ఆ మండలాల్లోనే తిష్టవేసి అక్కడే చక్రం తిప్పొచ్చు. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో ఇలాంటి చిత్రవిచిత్రాలే జరిగాయి. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి అర్హతలేని అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించి అందలం ఎక్కించడం చర్చనీయాంశంగా మారింది. -ఆంధ్రజ్యోతి -మచిలీపట్నం

రెవెన్యూ విభాగ బదిలీల్లో అవకతవకలు

- ఆర్థిక కథ నడిపితే చాలు.. అర్హత లేకున్నా అందలం
- కృత్తివెన్ను తహసీల్దార్ నియామకంలో విడ్డూరాలు
- గతంలో సస్పెండ్ అయినా వారికే పోస్టింగ్
- ఏళ్ల తరబడి అక్కడే తిష్టవేసి వ్యవహారాలు
- ఏడు మండలాల్లో డిప్యూటీలే తహసీల్దార్లు



ఆ ఏడు మండలాల్లో వారే..

జిల్లాలోని వివిధ మండలాల్లో తహసీల్దార్ల నియామకంలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గుడ్లవల్లేరు, గుడివాడ, బంటుమిల్లి, పెడన, గూడూరు, కోడూరు, కృత్తివెన్ను మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లే తహసీల్దార్లుగా కొనసాగుతున్నారు. వీరిని ఏ ప్రాతిపదికన నియమించారో అర్థం కాని విషయం. కలెక్టరేట్‌లోని ఓ కీలక అధికారిని ప్రసన్నం చేసుకుంటే నిబంధనలను పక్కన పెట్టి ఆయా మండలాల్లో తహసీల్దార్లుగా నియమిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

కృత్తివెన్ను తహసీల్దార్ నియామకంలో తతంగాలు

ఆగస్టు 31న కృత్తివెన్ను మండల తహసీల్దార్ పదవీ విరమణ చేశారు. అక్కడ రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించే వరకు డిప్యూటీ తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించాలి. కృత్తివెన్ను మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రభుకిషోర్ పనిచేస్తుండగా, ఆయన డిప్యుటేషన్‌పై మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఉన్నారు. జీతం కృత్తివెన్ను మండలం నుంచే తీసుకుంటున్నారు. కాగా, ప్రభుకిషోర్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తెరవెనుక ఏం జరిగిందో కానీ ఈ ఉత్తర్వులు వెలువడిన సాయంత్రానికే ఉపసంహరించారు.

సస్పెండ్ అయినచోటే మళ్లీ ఉద్యోగం

మచిలీపట్నం నార్త్ మండలం రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శశికుమార్ డెప్యుటేషన్‌పై కృత్తివెన్ను మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. వైసీపీ హయాంలో 2024లో తహసీల్దార్ కార్యాలయంలో భూములకు సంబంధించిన రికార్డులు మాయమయ్యాయి. ఈ సంఘటన అప్పట్లో సంచలనం కలిగించింది. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జేసీ గీతాంజలిశర్మ ఈ అంశంపై విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా డిప్యూటీ తహసీల్దార్ శశికుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తెరవెనుక ఏం జరిగిందో కానీ శశికుమార్‌కు కొద్దికాలంలోనే మళ్లీ అదే కార్యాలయంలో అదే పోస్టు ఇచ్చారు. ఒకసారి సస్పెండ్ అయిన వారిని వేరే మండలంలో ప్రాధాన్యతలేని పోస్టు ఇవ్వడం ఆనవాయితీ. కానీ, శశికుమార్‌కు మళ్లీ

మిగతా 6లో..

తారాతీరం

విజయవాడ ఉత్సవ్‌లో సినీ సందడి

- పున్నమిఘాట్‌లో ప్రత్యేక కార్యక్రమాలకు ప్రణాళిక
- ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు మెగా ఈవెంట్స్
- చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కల్యాణ్ సినిమా ఫంక్షన్లు
- ప్రముఖ సంగీత దర్శకులు, గాయకులతో మ్యూజిక్ మజా
- మిస్ విజయవాడ, మారథాన్, కృష్ణానదిలో పడవ పోటీలు
- ప్రకాశం బ్యారేజీపై క్రాకర్స్ ఫైరింగ్, సోషల్ మీడియా అవార్డ్స్

VIJAYAWADA UTSAV
One City, One Celebration
Sep 22nd to Oct 2nd

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా ఉత్సవాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించే 'విజయవాడ ఉత్సవ్'లో తారలు తళుక్కుమననున్నారు. ఈ ఉత్సవ్‌లో అగ్ర కథానాయకుల మూవీ ఈవెంట్స్ జరగనుండటం విశేషం. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా పాటల లాంచ్ ఈ ఈవెంట్‌లో జరగనుంది. అలాగే,

మిగతా 6లో..

విహంగామా

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విహంగాలు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఎయిరుపోర్టు చుట్టుపక్కల వ్యర్థాలు పేరుకుపోవడం, వర్షపు నీరు.. చెరువుల మాదిరిగా నిల్వ ఉండటం, వాటిలో చేపలు పెరుగుతుండటంతో పక్షులు భారీగా వస్తున్నాయి. విమాన టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో ఎదురుగా వస్తున్నాయి. విమానాశ్రయ చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వందలమంది ప్రయాణికుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారాయి.

- గన్నవరం విమానాశ్రయంలో పక్షులతో ఇబ్బందులు
- విమానాల ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో అడ్డుగా..
- చెత్తకుప్పలతో నిండిపోతున్న ఎయిర్‌పోర్టు పరిసరాలు
- వర్షపు నీరు నిల్వ ఉండి.. చెరువులుగా మారి..
- భారీగా తరలివస్తున్న పెద్ద సైబీరియా పక్షులు
- బోర్డులు పెట్టి చేతులు దులుపుకొన్న పంచాయతీ
- గురువారం ఎయిరిండియా విమానానికి తప్పిన ప్రమాదం



విమానాశ్రయం ప్రహరీ వద్ద చెరువుగా నిలిచిపోయిన వర్షపు నీరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరంలోని విజయవాడ విమానాశ్రయం నుంచి విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ చేయడానికి పైలెట్లు భయపడాల్సి వస్తోంది. ఎక్కడ పక్షులు ఢీకొంటాయేమోనని ఆందోళన చెందాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో విమానాశ్రయం రన్‌వే పరిధిలో పక్షులు ఎగరటం పరిపాటిగా మారింది. పక్షుల

మిగతా 6లో..

అడవి అందాలు చూసొద్దాం..



- కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు సందర్శకుల తాకిడి
- కనువిందు చేస్తున్న జలపాతాలు

6

అడవి అందాలు చూసొద్దాం..

- కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు సందర్శకుల తాకిడి
- కనువిందు చేస్తున్న జలపాతాలు
- సెలవు రోజుల్లో సందడే సందడి



మూలపాడు నగరవనంలో సందర్శకులు, కొండపల్లి రిజర్వు ఫారెస్టులో జలపాతం, వెదురువనం సమీపంలో నీటి ఊటపాయలో యువత కేరింత

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి)

నిత్యం బిజీ బిజీగా గడిపే నగరప్రజలు మూలపాడు నగరవనంలోని, కొండపల్లి రిజర్వు ఫారెస్టు అందాలను చూసేందుకు క్యూ కడుతున్నారు. సెలవు రోజుల్లో, పండుగల వేళ సందర్శకులు పెద్దఎత్తున మూలపాడు నగరవనం, కొండపల్లి ఖిల్లా తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ సహజసిద్ధంగా ఉన్న జలపాతాలు సందర్శకులకు కట్టిపడేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొండపల్లి రిజర్వు ఫారెస్టులో పలుచోట్ల జలపాతాలను తిలకించేందుకు వస్తున్న యువత, చిన్నారులు పచ్చిన వనంలో స్వచ్ఛమైన నీటిలో కేరింతలు కొడుతున్నారు. పర్యాటకులను వెదురువనం అందాలు అలరిస్తున్నాయి. పార్కులో ఆట వస్తువులు పిల్లలు, పెద్దలను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన నెమలి బొమ్మ పార్కుకే కొత్త అందాలను అద్దింది. మొత్తం మీద సెలవు రోజుల్లో పలు పాఠశాలల విద్యార్థులతో ఉపాధ్యాయులు వచ్చి పార్కులో ఎంజాయ్ చేస్తున్నారు. సందర్శకులను ఆకర్షించేందుకు పర్యాటక, అటవీ శాఖ అధికారులు నగరవనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.





ఏపీ, టీఎస్ రాష్ట్రాల ప్రధాన ఆదాయపు పన్ను కమిషనర్ అనిల్ కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో ఆదాయపు పన్ను కమిషనర్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రధాన ఆదాయపు పన్ను కమిషనర్ ఎం.అనిల్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో వీకే శీనానాయక్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆయనకు ఆశీస్సులు.. లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.



మిలాద్ ఉన్ నబి ఊరేగింపులో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని, బుద్దావెంకన్న, ఫతావుల్లా, ఎంఎస్ బేగ్ తదితరులు

మహ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శం

- ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త జీవితం సర్వమానవాళికి ఆదర్శమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు (మిలాద్ ఉన్ నబి) పురస్కరించుకుని వన్‌టౌన్ పంజా సెంటర్‌లో జరిగిన వేడుకల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలందరూ కులమతాలకు అతీతంగా మత సామరస్యం పాటిస్తూ అన్ని పండగలు చాలా ఘనంగా నిర్వహించుకుంటారన్నారు. మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం పంజా సెంటర్ నుంచి కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలోని మసీదు వరకు ఊరేగింపులో ఎంపీతో పాటు టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, ఎంఎస్ బేగ్, ఎండీ ఫతావుల్లా, ముస్లిం మతపెద్దలు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చంద్రగ్రహణం నాడు శివాభిషేకం మంచిదే

- విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో ఆదివారం సంభవించనున్న చంద్రగ్రహణం నాడు అన్ని రాశుల వారు శివాభిషేకం కార్యక్రమంలో పాల్గొనడం మంచిదని వేద పండితుడు విష్ణుభొట్ల సూర్యనారాయణశర్మ తెలిపారు. రాత్రి 9.57కు చంద్రగ్రహణం ప్రారంభమవుతుందని, 11 గంటలకు సంపూర్ణ చంద్ర గ్రహణం కనబడుతుందని, 11.41కు మధ్యకాలం, 7వ తేదీ రాత్రి 12 గంటలకు విడుపు ప్రారంభమవుతుందని, 8వ తేదీ తెల్లవారుజామున 1.26కు చంద్రగ్రహణం ముగుస్తుందన్నారు. గంటా 22 నిమిషాలు చంద్రగ్రహణ కాలం ఉంటుందని, అన్ని రాశుల వారు శివార్చనలు, భగవద్గీత పారాయణలు, విష్ణుసహస్రనామ పారాయణలు చేయడం సముచితమన్నారు. గ్రహణానికి ముందు ఆలయ ద్వారాలను మూసివేస్తారని, గ్రహణాల అనంతరం స్థలశుద్ధి తరువాత ఆలయాలను తెరుస్తారని పురోహితుడు లొల్లా కుటుంబశాస్త్రి తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం మూసివేత

మోపిదేవి : మోపిదేవి గ్రామంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని సెప్టెంబరు 7 ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు చంద్రగ్రహణం సందర్భంగా మూసివేయనున్నట్టు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం మహాసంప్రోక్షణ నిర్వహించి తదుపరి 10 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించబడుతుందని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి

గవర్నర్‌పేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ రణబేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రణభేరి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రణభేరి కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులను పోరాటానికి సిద్ధం చేసి సెప్టెంబరు 25న విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోగా ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పనిచేస్తోందని విమర్శించారు. మూడునెలలుగా మినిమమ్ టైం స్కేల్ టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5 దళాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సన్నద్ధం చేసే కార్యక్రమానికి యూటీఎఫ్ శ్రీకారం చుట్టిందన్నారు. ఈనెల 25న వేలాది మంది ఉపాధ్యాయులను సమీకరించి విజయవాడలో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేటమ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, నేతలు ఎం. హనుమంతరావు, ఎ.గోపాలకృష్ణ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ టర్న్..!

- జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు లేకుండా యూటర్న్
- ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికుల ఆందోళన
- వెంటనే యూటర్న్ మూసేయాలని విజ్ఞప్తి



హైదరాబాద్-విజయవాడ యూటర్న్ తీసుకుని వెళుతున్న వాహనం

(జగ్గయ్యపేట రూరల్, ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారిపై అంతర్రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద యూటర్న్ ప్రమాదకరంగా ఉన్నా ఆర్ అండ్‌బీ అధికారులు, స్థానిక పోలీసులు పట్టించుకోకపోవటంపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రహదారిని ఆరు వరుసలుగా విస్తరిస్తున్న నేపథ్యంలో సూర్యాపేట జిల్లా రామాపురం క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా ఫ్లై ఓవర్ నిర్మిస్తుండటంతో తెలంగాణ, ఆంధ్రలోని పలు ప్రాంతాలకు వెళ్లే రహదారిని మూసేశారు. ఈ నేపథ్యంలో అటుగా వెళ్లే వాహనాలు రాష్ట్రంలోకి వచ్చి అనధికారికంగా ఏర్పాటు చేసిన యూటర్న్ వినియోగిస్తుండటంతో హైదరాబాద్-విజయవాడ వైపు వచ్చే వాహనాలతో పాటు విజయవాడ-హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. గతేడాది



విజయవాడ-హైదరాబాద్ రహదారిలో యూటర్న్

పాలేటికి వరదలు వచ్చినప్పుడు హైదరాబాద్-విజయవాడ రోడ్డుమార్గంలో బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కోతకు గురవటంతో రెండో బ్రిడ్జిపై నుంచి వాహనాలు రాకపోకలు సాగించాయి. ఆ సమయంలో జరిగిన ప్రమాదంలో తల్లీ కుమారుడు మృతి చెందటంతో అధికారులు యుద్ధప్రాతిపదికన డివైడర్ తొలగించి యూటర్న్ ఏర్పాటు చేశారు. బ్రిడ్జి పూర్తయినా యూటర్న్‌ను మూయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఆంధ్ర-తెలంగాణలోని వివిధ సిమెంట్ కార్మాగారాలు, చిన్న కర్మాగారాలకు హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు గరికపాడు వద్దనున్న యూటర్న్ తీసుకుని తెలంగాణలోకి వెళ్తుండటంతో రెండు వైపులా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి యూటర్న్ మూసేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూటర్న్‌ను మూసి 500 మీటర్ల దూరంలోని తక్కెళ్లపాడు ఫ్లై ఓవర్ కిందగా వచ్చి వెళ్లేలా చూడాలని వారు కోరుతున్నారు.

కిరాతకంగా నరికేశాడు!

- వివాహితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు
- మనస్పర్థలు రావడంతో విడిపోయారు
- విడాకులు తీసుకుందన్న కక్షతో దాడి
- భార్య పరిస్థితి విషమం

మచిలీపట్నం క్రైమ్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భార్యపై విచక్షణారహితంగా భర్త దాడిచేయడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామరాజు(28), పద్మ (31) దంపతులు. పద్మకు ఇదివరకే వివాహం కాగా ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామరాజు పద్మను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలం వీరి కాపురం సజావుగానే ఉన్నా తర్వాత విభేదాలు రావడంతో నాలుగు నెలలక్రితం పద్మ విడాకులు తీసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి సర్కిల్ పేటలో ఉంటోంది. అయితే విడాకులు తీసుకోవడం భరించలేని రామరాజు ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం పూటుగా మద్యం సేవించి పద్మ ఇంటికి వెళ్లి ఆమెతో గొడవపడ్డాడు. మాట మాట పెరగడంతో వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. పద్మకు చేతులు, మెడ, తలపై తీవ్రగాయాలుకాగా కుటుంబసభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక మేత

(5వ పేజీ తరువాయి)

వరదలు తగ్గిన ప్రతిసారీ నదిలో తవ్వుతూ అధికారిక పాయింట్‌లో డంప్ చేసి ఉండాలి. లేదా ముందే నిర్ణీత పరిమాణం కంటే ఎక్కువ డంప్ చేసి ఉండాలి. ఈ మూడింటిలో ఏదో ఒకటి కచ్చితంగా జరిగి ఉంటుంది. ఈ వ్యవహారంలో స్థానిక పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారుల హస్తం కూడా ఉండబట్టే ఈ తరహా అక్రమాలు సాధ్యమవుతున్నాయి.

పాత వే బిల్లులతో..

తోట్లవల్లూరులో కొందరు అక్రమార్కులు ఏకంగా అధికారిక స్టాక్ పాయింట్లనే చెరబట్టారు. పాత వే బిల్లులతో ఇసుకను బయటకు తరలిస్తున్నారు. 2024 నాటి వే బిల్లులు చూపిస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఆర్డర్ ఐడీ, ట్రిప్ నెంబర్, కస్టమర్ పేరు, మొబైల్ నెంబర్, ఇసుక పరిమాణం, సప్లయి పాయింట్, డిస్పాచ్ డేట్, డ్రైవర్ పేరు, డ్రైవర్ మొబైల్ నెంబర్, వెహికల్ నెంబర్, అడ్రస్ వంటివన్నీ చూస్తే అది అసలైన ఓచర్ అనుకుంటారు. డిస్పాచ్ డేట్‌ను పరిశీలిస్తే.. ఆరోజే ఇసుకను పంపిణీ చేసినట్టుగా ఉంటుంది. ఓచర్‌ను ఎవరు చూసినా అది నిజమే అనుకుంటారు. ఇక్కడ అసలైన రహస్యం మరొకటి ఉంటుంది. అందులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కిందటి ఏడాది అని ఇట్టే తెలిసిపోతుంది. చోడవరం స్టాక్ పాయింట్ నుంచి పల్నాడు జిల్లా మాచర్లలోని నెహ్రూనగర్‌కు తరలించిన ఓ ఇసుక లోడు ఓచర్‌ను పరిశీలించగా, అది 2024లో జారీ చేసిందని తేలింది.

కొండంత నిఘా

(5వ పేజీ తరువాయి)

సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. నగదుకు సంబంధించినవి రెండో స్థానంలో ఉన్నాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రి వరకు ఒక ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు. కుమ్మరిపాలెం వైపు నుంచి పాలఫ్యాక్టరీ, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ వరకు మరో ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు. మొత్తం 35 ప్రదేశాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి అక్కడ సీసీఎస్ సిబ్బందిని నియమించడానికి మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఈ పాయింట్లలో సీసీఎస్ సిబ్బందితో పాటు వివిధ జిల్లాల నుంచి బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని కేటాయిస్తారు.

విహంగామా

(5వ పేజీ తరువాయి)

కారణంగా విమానాలు ల్యాండింగ్ కాకుండా ఆకాశంలోనే చక్కెర్లు కొట్టిన ఉదంతాలు కూడా ఉన్నాయి. గురువారం ఓ పక్షి ఢీకొనడంతో ఏకంగా విమాన సర్వీసే రద్దయ్యింది.

విమానాశ్రయం చుట్టూ ఆహార వ్యర్థాలు, చెత్తాచెదారం

విమానాశ్రయం చుట్టూ ఆహార వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఎక్కువగా వేస్తున్నారు. ఎయిర్‌పోర్టు నాలుగువైపులా గన్నవరం, దావాజీగూడెం, అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడి, కేసరపల్లి పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆరు గ్రామాల పరిధిలోని పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయి. గన్నవరం పంచాయతీ పనితీరైతే ఘోరంగా ఉంది. రోడ్లపై చెత్తకుండీలు, పక్కనే వ్యర్థాలు ఉంటున్నాయి. గన్నవరంలోని హోటళ్ల నిర్వాహకులు, కొబ్బరిబొండాల దుకాణాలవారు, కూరగాయలు విక్రయించేవారు, మాంసం షాపులవారు తమ దగ్గర ఉన్న వ్యర్థాలన్నింటినీ గన్నవరం చివర.. అంటే విమానాశ్రయానికి సమీపంలో ఎన్‌హెచ్-16 పక్కనే డంప్ చేస్తున్నారు. ఆహార వ్యర్థాలతో పాటు దుకాణాల్లోని చెత్తాచెదారం అంతా కూడా ఇక్కడే డంప్ అవుతోంది. దీంతో కాకులు, కొంగలు, ఇతర పక్షులు ఆహారం కోసం వస్తున్నాయి. పక్షుల సంచారం వల్ల విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు సమస్య ఏర్పడుతోంది. విమానాలు ల్యాండ్ అయ్యే ముందు, టేకాఫ్ అయ్యే సమయంలో పక్షులు ఉంటే పారిపోవటానికి వీలుగా బాంబులు పేలుస్తారు. కానీ, ఇటీవల కాలంలో సైబీరియా నుంచి కొంగలు వస్తున్నాయి. ఇవి శబ్దాలకు పారిపోవట్లేదు.

సైబీరియా పక్షులతో సమస్య

గన్నవరం విమానాశ్రయం రన్‌వే ప్రహరీవైపు లోతట్టు ప్రాంతాలు ఉన్నాయి. వర్షాలు కురవటం వల్ల ఇవన్నీ చెరువులుగా మారుతున్నాయి. వాస్తవానికి ఈ నీరు హైవే పక్కన డ్రెయిన్ మార్గంలో కేసరపల్లి మీదుగా సాగుతూ బుడమేరులో కలవాలి. కానీ, డ్రెయిన్ పూడుకుపోవటం, ఆక్రమణల కారణంగా నీరు ఎటూ పోవట్లేదు. అవన్నీ క్రమేణా చెరువులుగా మారుతున్నాయి. వీటిలోని చేపలు తినటానికి సైబీరియా కొంగలు వస్తున్నాయి. ఈ కొంగలు పరిమాణంలో పెద్దగా ఉంటాయి. ఈ వృథా నీటిని మళ్లించేందుకు పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. దావాజీగూడెం, అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడి గ్రామాల్లో అయితే పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లు జరిగినప్పుడు ఆహార వ్యర్థాలన్నింటినీ రోడ్ల పక్కనే పడేస్తున్నారు. ఫలితంగా విమానాశ్రయ పరిసరాలు పక్షులకు ఆవాసంగా మారుతున్నాయి. గతంలో అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక విమానం ల్యాండ్ అయినపుడు రన్‌వే ప్రహరీ బయట నల్లటి పొగ వ్యాపించింది. చెత్త తగలబడటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది.

ఎయిర్‌పోర్టు అధికారులు వినతులు పట్టించుకోరా?

ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పటి నుంచే ఈ సమస్యను గుర్తించిన ఎయిర్‌పోర్టు అధికారులు ఆ చుట్టుపక్కల ఆహార వ్యర్థాలను అరికట్టాలని, చెత్తకుప్పలను వేయించొద్దని జిల్లా యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సమావేశాల్లో కూడా ఈ అంశం చర్చకు దారితీసింది. అప్పట్లో తాత్కాలిక చర్యలు తీసుకున్నా ఆ తర్వాత వదిలేశారు. పంచాయతీలు బోర్డులు ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుని విమాన ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

తారాతీరం

(5వ పేజీ తరువాయి)

యువరత్న బాలకృష్ణ నటిస్తున్న అఖండ-2 సాంగ్ లాంచ్, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న 'ఓజీ' ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా దసరా ఉత్సవ్‌లో ప్రధాన ఆకర్షణ కానుంది. నటుడు సిద్ధూ నటించిన 'తెలుసు కదా' మూవీ టీమ్ ఈ ఉత్సవ్‌ను సందర్శించనుంది. వీటితో పాటు ఆహా నిర్వహిస్తున్న 'తెలుగు ఇండియన్ ఐడల్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించటానికి సంగీత దర్శకుడు తమన్, గాయకుడు కార్తీక్ రానున్నారు. అలాగే, గాయనీ గాయకులు శంకర్ మహదేవన్, ఆర్పీ పట్నాయక్, సునీత, గీతా మాధురి, రాహుల్ సిప్లిగంజ్, రోల్ రిడా, సమీరా భరద్వాజ్, చిన్మయి, కృష్ణ, రమ్య బెహరా, దామిని, హారిక, రోహిత్ సందడి చేయనున్నారు. ర్యాప్ మ్యూజిక్ కోసం కాప్రికో మ్యూజిక్ బ్యాండ్ రానుంది. వాటర్ అండ్ కేరళ డ్రమ్స్ మ్యూజిక్ ట్రూప్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

పున్నమిఘాట్‌లో కార్యక్రమాలు

పున్నమిఘాట్, గొల్లపూడి, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలలో 'విజయవాడ ఉత్సవ్' కార్యక్రమాలు జరగనున్నాయి. పున్నమిఘాట్‌లో దేవీ పెండాల్, డ్రోన్ షో, దాండియా అరీనా, హస్తకళల స్టాల్, సెల్ఫీ బూత్ ఏర్పాటు చేస్తారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. వాటర్ స్పోర్ట్స్‌లో భాగంగా పడవల పోటీలు, ప్రకాశం బ్యారేజీ దగ్గర బాణాసంచా పేలుళ్లు, గీతామాధురి లైవ్‌బ్యాండ్, సందీప్ నారాయణ్ కార్యక్రమాలు ఉంటాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలలో 11 రోజుల పాటు అన్‌లిమిటెడ్‌గా క్లాసికల్ డ్యాన్సులు, నాటకాలు, బుర్రకథలు, ప్రముఖుల ప్రవచనాలు, లోకల్ టాలెంట్ క్లాసికల్ డ్యాన్సులు, లోకల్ టాలెంట్ కల్చరల్ కార్యక్రమాలు, యంగ్ కిడ్ డ్రమ్స్ వంటివి నిర్వహిస్తారు.

ఆకట్టుకునే ఈవెంట్స్ ఎన్నో..

నగరంలోని కాలేజీ యువతులకు 'మిస్ విజయవాడ' పోటీలు జరగనున్నాయి. 'విజయవాడ ఐడల్' పేరుతో సంగీత కార్యక్రమాలు, 'విజయవాడ ప్రీమియర్ లీగ్' పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. విజయవాడ మారథాన్, మెగా యోగా, హస్తకళాఖండాల పోటీలు జరుగుతాయి. ఇవికాకుండా అగ్ని అవార్డులు, సోషల్ మీడియా అవార్డులు ప్రత్యేకం.

ఉత్సవ్ లోగో సిద్ధం


విజయవాడ ఉత్సవ్ లోగో ఖరారైంది. నిర్వాహక కమిటీ శుక్రవారం దీనిని విడుదల చేసింది. రెండు రోజుల్లో భారీగా సన్నాహక ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'వన్ సిటీ.. వన్ సెలబ్రేషన్' అనే క్యాప్షన్‌తో దుర్గమ్మ బంగారు గోపురం, ప్రకాశం బ్యారేజీ చిత్రాలతో లోగోను తీర్చిదిద్దారు.

తిరకాసుల తహసీల్దార్లు

(5వ పేజీ తరువాయి)

అదే మండలంలో, అదే పోస్టు ఇవ్వడం గమనార్హం. ఇది రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఏడాది క్రితమే సస్పెన్షన్‌కు గురైన డిప్యూటీ తహసీల్దార్‌ను ఏకంగా పూర్తి అదనపు బాధ్యతలతో తహసీల్దార్‌గా నియమించడం వెనుక పెద్ద కథే నడిచిందని రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు చెప్పుకొంటున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్ హోదాలో ఉన్న శశికుమార్ ఏళ్ల తరబడి కృత్తివెన్ను మండలంలో వీఆర్వోగా, సీనియర్ అసిస్టెంట్‌గా, డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారని రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు చెప్పుకొంటున్నారు. బదిలీల్లో భాగంగా వేరే మండలాలకు ఆయన్ను బదిలీ చేసినా వెంటనే డెప్యుటేషన్ వేయించుకుని కృత్తివెన్ను మండలానికే వచ్చేస్తున్నారని తెలుస్తోంది.

పెసర రైతు కుదేలు!



ఆరబోసిన పెసలు

- ఆశాజనకంగా పంట దిగుబడి
- గిట్టుబాటు ధర లేక రైతుల ఆందోళన
- మద్దతు ధరకు కొనని ప్రైవేటు వ్యాపారులు
- మార్క్‌ఫెడ్ కేంద్రాలు ప్రారంభించాలని వినతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పెసల రైతు పరిస్థితి దారుణంగా తయారైంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించటం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8వేలకు పైగా ఉండగా, వ్యాపారులు రూ. 6 వేలకు కొనటం గగనంగా మారింది. మార్కెట్ ధర రూ.2వేలకు పైగా వ్యత్యాసం ఉండటంతో ఎక్కువ మంది రైతులు పంటను శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు. పాలకులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర ఇప్పించి ఆదుకోవాల్సిందిగా రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ ఏడాది తొలకరిలో రైతులు 10 వేల ఎకరాల్లో పెసర, మినుము పంటలు సాగుచేశారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, ఇతర అటుపోట్లను తట్టుకుని పంట బాగానే పండి ఆశాజనకమైన దిగుబడి వచ్చింది. కోతల సమయంలో పొడి వాతావరణంలో పంట ఏమాత్రం దెబ్బతినకుండా ఎకరానికి రెండు నుంచి నాలుగుబస్తాల వరకు దిగుబడి వచ్చింది. అయితే అధిక వర్షాలకు మినుము పంట మాత్రం 50 శాతం వరకు దెబ్బతిన్నది. పెసలు నాణ్యతాపరంగా బాగున్నా మార్కెట్ తీవ్ర నిరాశాజనకంగా ఉంది. క్వింటాకు రూ. 6,200 ధర మాత్రమే పలుకుతోంది. అంతకు మించి ధర పెట్టేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పెసలకు ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8,768. మద్దతు ధరకు, మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం ఉంది. ప్రస్తుతం బయట మార్కెట్లో విక్రయిస్తే క్వింటాకు రూ. 2,500లకు పైగా రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులు దక్కిందే ధర అన్నట్టుగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పంటను అమ్ముకుంటున్నారు. ఎక్కువ మంది రైతులు మాత్రం శీతలగిడ్డంగుల్లో నిల్వ చేశారు. ఇంకొంత మంది ఇళ్లల్లోనూ, కంచికచర్ల మార్కెట్ యార్డు ఆవరణలోని ఓపెన్ గిడ్డంగుల్లో ఉంచారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరకు పెసలు కొనుగోలు చేయాలని



కంచికచర్ల మార్కెట్ యార్డులో పెసల నిల్వలు

రైతులు కోరుతున్నారు. 2025-26 ఖరీఫ్ సీజన్ మద్దతు ధర అక్టోబరు ఒకటి నుంచి అమల్లోకి వస్తుంది. ఈలోగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా రైతులు పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గత మూడేళ్లుగా మార్క్‌ఫెడ్ అధికారులు జిల్లాలో పెసలను కొనటం లేదు. నాణ్యత తక్కువని, నాఫెడ్ నుంచి ఆర్డరు రాలేదని ఇతరత్రా సాకులు చెపుతూ వచ్చారు. గత ఏడాది ఒక దశలో శాంపిల్స్ కూడా సేకరించారు. సీఎం యాప్‌లో కూడా రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. కొనుగోలు చేసే తేదీ తెలియచేస్తామంటూ రైతులకు యాప్ ద్వారా సమాచారం వచ్చింది. అయినప్పటికీ అధికారులు పెసలు కొనకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇది పునరావృత్తం కాకుండా పాలకులు ముందుగానే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయించి ఆదుకోవాలని రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

దసరా ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించండి

కంకిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రి ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 22వ తేదీ నుంచి 11 రోజుల పాటు దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శివాలయం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులు ఇలా మొత్తం 25 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అనుమతి కోసం పంపించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, గుడిసేవ నాంచారయ్య, వణుకూరు విక్రమ్, బొర్రా వెంకట్, వీరంకి శ్యామ్, వడ్డాది శ్రీను, అన్నవరపు శివపార్వతి, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరిస్తున్న ముస్లిం పెద్ద అబ్దుల్‌బారి

మతసామరస్యానికి ప్రతీక మిలాద్‌ఉన్ నబి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త 1500వ జయంతి సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్డులోని మదీనా మజీద్‌లో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మజీద్ హన్‌ఫీ నౌజవాన్‌కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ముస్లిం పెద్దలు ఎండీ కాయల్,ఎండీ సోయబ్, అబ్దుల్ బారి,షేక్ అబ్దుల్లా తదితరులు ప్రసంగించారు. ముందుగా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మౌలాలి, షేక్ మీర్జావలి ఆధ్వర్యంలో ముస్లింలు జంక్షన్ సెంటర్‌లో ద్విచక్రవాహన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మహ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి అనుసరణీయమని, తోటి వారి పట్ల ప్రేమ, సోదరభావంతో మెలగాలనే బోధనలు మతసామరస్యానికి ప్రతీకలని బిలాల్ మసీదు గురువు అబ్దుల్ మజీద్ అన్నారు. వీరవల్లి బిలాల్ మసీదులో శుక్రవారం మిలాద్ ఉన్ నబి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సేవాభావం ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని మహ్మద్ ప్రవక్త బోధించారన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ కాలీషా, నన్నే బాషా, రియా జ్‌బాషా, అలీ, రహీం తదితరులు పాల్గొన్నారు.



వీరవల్లి బిలాల్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చడానికి మానవత ముందు ఉంటుందని మానవత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మానవత కార్యాలయంలో అప్పనవీడుకు చెందిన బీటీఏ విద్యార్థిని పోతినేని జ్ఞానదీపకకు కాలేజీ ఫీజులు నిమిత్తం రూ.7500లు ఆర్థిక సాయం అందించారు. మానవత సభ్యులు సత్యనారాయణ, రామచంద్రరావు, ఇందిరా దేవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





జంక్షన్ విశ్వకవి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో.. గన్నవరం టీడీపీ కార్యాలయంలో.. వీరవల్లి వాణివిద్యానికేతన్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

ఉయ్యూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. గురుపూజోత్సవం పురస్కరించుకుని పలుసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏజీ అండ్ ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు వీరంకి వెంకటేశ్వరరావు,నాగమల్లేశ్వరరావును అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, బాపిరాజు, వెంకటేశ్వరరావు, నూకల సాంబశివరావు, మస్తాన్, ఆంజనేయులు తదితరులు ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు.

కానూరు : దేశభవిష్యత్‌ను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకు ఉందని, దీనిని సక్రమంగా వినియోగించాలని అక్షరదాన్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎంఎస్ఆర్ మూర్తి అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రొ. వీసీ ఏవీ రత్న ప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, డాక్టర్ పాండురంగారావు తోపాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరం : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శనీయుడని టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావుతో కలసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, మండల కార్యదర్శి బోడపాటి రవికుమార్, నెక్కంటి శ్రీదేవి, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ తిరివీధి నరేష్, నందూరు విశ్వనాథం, కాగితాల నాగరాజు, వెంకటకృష్ణ, మోదుగుమూడి వేణు, కోంద్రు శోభనాద్రి, తమలం సాయి తదితరులు పాల్గొన్నారు.

●ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్ ఇమాం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా, షేక్ హసీనా, జయశ్రీ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ శిరోధార్యమని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ అన్నారు. స్థానిక గుడివాడ రోడ్డులోని విశ్వకవి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకతో పాటు పాఠశాల రజతోత్సవ వేడుకను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేడుకలో ఎంఈవోతో పాటు స్థానిక శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్‌ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, సీనియర్ వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, నేతలు నూలు నరసింహారావు, బేతాళ ప్రమీళరాణి తదితరులు రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ● లయన్స్ క్లబ్, మానవత, ఆదిత్య బధిర సంస్థల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించి వారిలోని జ్ఞానజ్యోతి వెలిగించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులని ప్రిన్సిపాల్ నందిగం రవికుమార్ అన్నారు. వీరవల్లి వాణివిద్యానికేతన్‌లో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ప్రేమకుమారి, జ్యోతి, వినాయకరాజు, దుర్గామాధురిలను విద్యార్థులతో కలిసి సత్కరించారు.




ఉయ్యూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్.. కానూరు సిద్ధార్థ వర్సిటీలో ఎంఎస్‌ఆర్ మూర్తిని సత్కరిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

గన్నవరం బార్ అసోసియేషన్ ఒక్కటే

రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత ఆదేశాలు వివరించిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, ప్రకాశరావు

గన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గన్నవరంలో బార్ అసోసియేషన్ ఒక్కటేనని రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత ఆదేశాలు జారీ చేశారని బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ కార్యవర్గం తెలిపింది. స్థానిక కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శి గారపాటి రవికుమార్, రామకూరి ప్రకాశరావులు మాట్లాడుతూ, కొంత మంది న్యాయవాదులు బార్ అసోసియేషన్ ప్రాక్టీసింగ్ అడ్వొకేట్స్ అసోసియేషన్‌గా తమకు తాము ప్రకటించుకుని న్యాయస్థానాలతో పాటు సాధరణ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని, ఈ విషయాన్ని నిబంధనల మేరకు ఎన్నికైన బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. స్పందించిన బార్ కౌన్సిల్ కార్యదర్శి పద్మలత బార్ అసోసియేషన్ ఆఫ్ ప్రాక్టీసింగ్ అడ్వొకేట్స్ అసోసియేషన్‌కు గుర్తింపు లేదని స్పష్టత ఇచ్చినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎల్. వేణుబాబు, కోశాధికారి ఆర్. విమల్‌కుమార్, ఏజీపీ ఎస్టీజీ నీరజ, మహిళా ప్రతినిధి ఎల్. భగిరథి, క్రీడా, సాంస్కృతిక కార్యదరి జీ. సీతారామయ్య, ఈసీ సభ్యులు జీఎస్‌ఆర్. మూర్తి, వైఆర్.శారద. ఎన్. రమేష్, పి. శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రసాదంపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్ర వారం పటమటలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ నుంచి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లికి చెందిన పామర్తి శ్రీనివాసరావుకు రూ.2.5 లక్షలు, పొట్టిపాడుకు చెందిన నిమ్మకూరు శ్రీలక్ష్మీకి రూ.2.5 లక్షలు, బాపులపాడు మండలం రేమల్లెకు చెందిన చల్లగుళ్ల లక్ష్మి పెరుమాళ్లకు రూ.2 లక్షలు, గన్నవరం మండలం సూరంపల్లికి చెందిన గోడెం సాంబశివరావుకు రూ.2 లక్షలు చొప్పున యార్లగడ్డ అందజేశారు.



ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు : అనారోగ్యంతో బాధపడుతున్న పోరంకికి చెందిన ముసలమడుగు వెంకటేశ్వరమ్మ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మూడున్నర లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీ చెక్కును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాధితురాలి బంధువుకు ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులతో జీవించాలి

మంత్రి వాసంశెట్టి సుభాశ్

ఉయ్యూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయకుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని రాష్ట్ర కార్మిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. ఉయ్యూరు చింతల తోట ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ గణేశ్ మహోత్సవాల్లో శుక్రవారం ఆయన పాల్గొని పూజలు చేశారు. ఉయ్యూరు మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, గుర్నాధరావు, కమిటీ అధ్యక్షుడు జంపాన శివయ్య, టీసీ నాయకుడు పామర్తి జయప్రకాశ్, డాక్టర్ జయప్రసాద్, పామర్తి శివ తదితరులు మంత్రికి ఘనస్వాగతం పలికారు.

● గణపతి నవరాత్రుల పురస్కరించుకుని స్థానిక వీరమ్మతల్లి ఆలయం సమీపాన బాలగణేశ్ మండపంలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో చేశారు. ● ఉయ్యూరులో శుక్రవారం గణేశ్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. చింతలతోట ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ గణేశ్ మహోత్సవంలో భాగంగా నిమజ్జన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, రాజులపాటి ఫణి, కమిటీ సభ్యుడు జంపాన శివ తదితరులు పూజలు చేసి ప్రారంభించారు.

గన్నవరం: మండలంలోని గన్నవరం, వీరపనేనిగూడెం, దావాజీగూడెం గ్రామాల్లో వినాయకుని విగ్రహాల నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. వీరపనేని గూడెం పాలకేంద్రం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద లడ్డూ వేలం పాటలో భక్తుడు కె.రాఘవరెడ్డి రూ.80వేలకు దక్కించుకున్నారు. నందిపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** కుల మతాల కతీతంగా వినా యకచవితి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. వీరవల్లిలో కమిటీ కుర్రాళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనోత్సవాన్ని శుక్రవారం ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, మండాది రవీంద్ర, లింగమనేని శ్రీనివాసరావు, చిన్ని, ఆనంద్, నళినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : పోరంకిలోని ప్రభునగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద యువనేత బోడె వెంకట్రామ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ వినాయకచవితి సమాజంలోని అన్ని వర్గాల జీవితాల్లో వెలుగు లు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ద్రోణవల్లి సుబ్బారావు తదితర టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



పోరంకి ప్రభునగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బోడె వెంకట్రామ్




మంత్రి వాసంశెట్టి శుభాష్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న ఉప్పలూరు ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి.. రంగన్నగూడెం ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయుడు బండ్లపల్లి నాగరాజు

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారం

కంకిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉప్పలూరు ఎంపీయూపి పాఠశాల ఉపాధ్యాయురాలు చిరువోలు లంక నాగమల్లేశ్వరికి జిల్లా ఉత్తమ పురస్కారం అవార్డును శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి శుభాష్ అందించారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో పుర స్కారం అందుకోవడం ఆనందంగా ఉందని ఆమె తెలియజేశారు. ఉత్తమ ఉపాధ్యాయుని పురస్కారం అందుకోవడంతో తమపై భారం మరింత పెరిగిందని ఆమె చెప్పారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రంగన్నగూడెం ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయుడు బండ్లపల్లి నాగరాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్కారం అందుకోవడం అభినందనీయమని ఎన్‌ఎస్ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. మచిలీపట్నంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ నాగరాజును సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. నాగరాజు పురస్కారం అందుకోవడం పట్ల సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ అభినందించారు.

నేడు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు విద్యుత్ సెక్షన్ పరిధిలోని 33/11కేవీ నందమూరు సబ్‌స్టేషన్ ఏరియాలో చికినాల ఫీడర్ లైన్ల మరమ్మతులు శనివారం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నందమూరు, మానికొండ ప్రాంతాల్లో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పిరమిడ్ వ్యవసాయంతో అధిక దిగుబడులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాల్లో పిరమిడ్ ఆకృతులను పెట్టడం ద్వారా చీడపీడల బాధ తగ్గుతుందని, ఇది తన స్వానుభవమని ధాన్యరత్న, గుంటూరు జిల్లా పీఎస్‌ఎస్‌ఎం అధ్యక్షుడు లక్ష్మణరావు తెలిపారు. కోడూరుపాడులో సరస్వతీ పిరమిడ్ ధాన్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పిరమిడ్ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు.



దుర్గగుడిలో రెండు మంచినీటి ప్లాంట్లను ప్రారంభించిన ఈవో శీనా నాయక్ దంపతులు, అర్చకులు, దివీస్ ప్రతినిధులు

దివీస్ లేబొరేటరీస్ సహకారంతో
రెండు జలప్రసాద కేంద్రాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దివీస్ లాబొరేటరీస్ సహకారంతో భక్తుల సౌకర్యార్థం దుర్గగుడి ఆవరణలో రెండు తాగునీటి శుద్ధి ప్లాంట్‌లను శుక్రవారం ఈవో శీనానాయక్ దంపతులు ప్రారంభించారు. దుర్గగుడి ప్రాంగణంలోని అద్దాల మండపం సమీపంలోని శివాలయం వద్ద ఒకటి, కొత్త పూజా మండపాల సమీపంలోని గోపికా కృష్ణుల విగ్రహాల వద్ద మరొక ప్లాంట్లను శీనానాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రెండు నీటి ప్లాంట్‌ల ఏర్పాటుకు సహకరించిన దివీస్ లాబొరేటరీస్ వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దివీస్ లేబొరేటరీస్ యాజమాన్యం రూ.80 లక్షలతో ఐదు జల ప్రసాదాల కేంద్రాల ఏర్పాటుకు ముందుకు వచ్చి గతంలో రెండు, ఇప్పుడు రెండు జల ప్రసాదాల ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చారన్నారు. మిగిలిన ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని నిర్ణయించారన్నారు. వైదిక కమిటీ సభ్యులు శ్యావాస్య మహర్షి, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, ఈఈ కోటేశ్వరరావు, దేవస్థానం అధికారులు, దివిస్ ప్రతినిధులు బి.కిషోర్, సి.హెచ్.శ్రీనివాసులు, ఎస్.సాయి కృష్ణ పాల్గొన్నారు.

తిరిగి కృష్ణానదిలోకి వినాయక విగ్రహాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : వేదాద్రి వద్ద కృష్ణానది వరద తగ్గటంతో నిమజ్జనం చేసిన విగ్రహాలు ఒడ్డుకు చేరాయి. నీరులేక.. శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన ఫొటో కథనానికి అధికారులు తక్షణం స్పందించారు. ఒడ్డుకు చేరిన విగ్రహాలను ఎక్స్‌కవేటర్‌తో నదిలోకి పంపించారు.



బైక్‌లో పాము చేరడంతో గుమిగూడిన జనం

బైక్‌లో తాచుపాము..ట్రాఫిక్ స్తంభన

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిల్లకల్లులో బైకులో పాము దూరి ట్రాఫిక్ జామ్ అయిన ఘటన శుక్రవారం జరిగింది. వత్సవాయి మండలానికి చెందిన ప్రజలు తమ వాహనాల ను చిల్లకల్లు ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసుకుని పనులు ముగించుకుని తిరిగి వాహనాలను తీసుకుని వెళ్తుంటారు. ఏపీ16డీబీ 3160 నంబరు బైకులో తాచుపాము దూరటం గమనించిన స్థానికులు వాహనం నుంచి పామును బయటకు తీసి చంపారు. సంఘటనను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు గుమిగూడడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది.

ప్రసన్నగణపతి సేవలో జబర్దస్త్ టీం

నందిగామ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు నందిగామ పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. శ్రీవాసవీ మార్కెట్‌లో గణనాధుడికి భక్తులు రూ.3.20 కోట్ల నోట్లతో అలంకరించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా జబర్‌దస్త్ టీమ్ ఆది, ఫైనింగ్ శాంతి తదితరులు శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ కృష్ణకుమారి తదితరులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

పేలుడు ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జూపూడి శివారు భీమేశ్వరకాలనీలో ఈనెల 3వ తేదీన జరిగిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన గోడ గోపి (29) విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాలనీలో రెంటపల్లి కోటమ్మ ఇంటికి చుట్టూ ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు నిమి త్తం వెల్డింగ్ చేస్తుండగా ఒక్క సారిగా పేలుడు సంభవించి ఇల్లు ధ్వంసం అయ్యింది. ఈప్రమాదంలో వెల్డర్ మహేష్‌తో పాటు హెల్పర్ గోపి తీవ్రంగా గాయపడ్డాడు. మహేష్ ప్రాణాపాయం నుంచి బయటపడగా, గోపి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. చందర్లపాడు మండలం కూనాయిపాలెం గ్రామానికి చెందిన గోపికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదానికి గ్యాస్ బండ పేలడమే కారణం అని ప్రాథమికంగా అంచనా వేసినా పేలుడుకు ప్రధాన కారణం మాత్రం ఇంట్లో బాణా సంచా తయారీ వస్తువులు ఉన్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. పేలుడుగు గల కారణాలు తెలియాల్సి ఉంది.



ఉప్పలూరులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

రైతులందరికీ యూరియా అందిస్తాం

● కృష్ణా కలెక్టర్ బాలాజీ

కంకిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, ప్రతిఒక్క రైతుకు యూరియా అందించటం ప్రభుత్వ బాధ్యత అని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఆయన పర్యటించారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు తమ పొలాలకు రెండు విడతల యూరియా వేశారని తెలిపారు. కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులను నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



హెచ్‌ఎం తిమ్మరాజు సీతారామ్, మల్లవోలు దుర్గా శ్రీలక్ష్మి, కూచి ప్రమీలారాణిలను సత్కరిస్తున్న మంత్రి సుభాష్, జేసీ గీతాంజలి శర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మంచి సమాజం..ఉపాధ్యాయులతోనే సాధ్యం

● గురుపూజోత్సవంలో ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :, భావిభారత పౌరులను తీర్చిదిద్ది ఉత్తమ సమాజాన్ని నిర్మించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ, డీఈవో పివిజె రామారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మంత్రి సుభాష్ మాట్లాడుతూ, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనలు, రచనలు తరతరాలుగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. ప్రతి మనిషి జీవితంలో ఒక గురువు ఉంటారని, ఒక్కో దశలో వారు ఒక్కో విధంగా ప్రభావం చూపుతూ ఉం టారన్నారు. తన జీవితంలో గణపతి మాస్టారు ప్రభావితం చేశారని, తనలో నాయకత్వ లక్షణా లు ఉన్నాయని, సేవ చేసే గుణం ఉందని, కోపం కాస్త తగ్గించుకోవాలని, బీఎల్ చేయాలని, బం గారు భవిష్యత్ ఉంటుందని మార్గ నిర్దేశం చేశారన్నారు. ఆయన ఆశీస్సులు వల్ల ఈ స్థాయికి చేరుకున్నానని, వారిని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటానన్నారు. ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి కంటే గొప్ప వృత్తి మరొకటి లేదని ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పరిపాలనలో 13 డీఎస్సీలను నిర్వహించారని, సుమారు 1,80,208 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. సీఎం చంద్రబాబుకు విద్యావ్యవస్థ పట్ల ఎంత గౌరవం ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి షైనింగ్ స్టార్స్ పేరుతో జిల్లాలో 161 మంది విద్యార్థులకు 20 వేల రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇచ్చామన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో తోడ్పడతారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ఎవరూ సాటి రారన్నారు. రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ, అక్షర రూపంలో ఉన్న ఒక సిరా చుక్క లక్ష మంది మెదడులకు పదును పెడుతుందని మహాకవి కాళోజి చెప్పినట్టు అక్షరాలను మాలలుగా చేసి విద్యార్థుల మెడలో వేసి ఆ బిడ్డల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దే గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, ఒకే జీవితంలో అన్నీ సాధించడం ఎవరి వల్లా కాదని డాక్టర్ సర్వేపల్లి రోజుకు 20 గంటలు కష్టపడి ఉంటారని, అందుకే ఆయన ఉపాధ్యాయ జీవితంతో మొదలుపెట్టి దేశాధ్యక్ష పదవికి ఎదగగలిగారన్నారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు, డీఈవో పీవీజే రామారావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, డిప్యూటీ డీఈవోలు శేఖర్‌సింగ్, పద్మారాణి, రవికుమార్, ఏడీలు రవూఫ్, విద్యాలత, జిల్లా సైన్ అధికారి మహమ్మద్ జాకీర్ అహ్మద్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా 23 మంది టీచర్లను మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ, ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, జిల్లా ఎస్పీ గంగాధరరావు, డీసీఎంఎస్ చైర్మన్ రామకృష్ణ, జేసీ గీతాంజలిశర్మ, డీఈవో రామారావు ఘనంగా సత్కరించారు.

యూరియా కొరత లేదు : మంత్రి సుభాష్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూరియా కొరత, కొరత అంటూ దుష్ప్రచారం చేయడం వల్ల రైతులు ఆందోళన చెంది అవసరానికి మించి యూరియా కొనుగోలు చేశారన్నారు. ఎక్కువగా యూరియా వేస్తే భూమి దెబ్బతింటుందని, దీన్ని రైతులందరూ గమనించాలన్నారు. రైతుల్లో లేనిపోని అపోహలను, అలజడి సృష్టించి వైసీపీ నాయకులు తప్పుదారి పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని మంత్రి సుభాష్ సూచించారు. జిల్లా యంత్రాంగం ఎంతో అప్రమత్తంగా ఉందని, యూరియా కొరత లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుందన్నారు. రైతులు యూరియా తీసుకోవడానికి క్యూలో నిలబడితే దాన్ని నేరంగా చూపడం సమంజసం కాదన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్లకుమారరాజా, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త యలమంచిలి సురేష్

టీడీపీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల హత్యాయత్నం

● బొబ్బర్లంకలో ఘటన

మోపిదేవి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త యలమంచిలి సురేష్‌పై బొబ్బర్లంకలో వైసీపీ శ్రేణులు శుక్రవారం సాయంత్రం దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. యలమంచిలి సురేష్ కూలి పనులు చేసుకుంటూ, పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. బొబ్బర్లంక గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవానికి సమీప బంధువులు పిలవటంతో వెళ్లి ఊరేగింపు ముగించుకుని కొక్కిలిగడ్డలోని ఇంటికి వచ్చాడు. పాలు అమ్మకం చేసేందుకు బొబ్బర్లంక గ్రామానికి వెళ్లగా రహదారిపై అడ్డగించి వైసీపీ శ్రేణులు మైలా శివకుమార్, పీతా నవీన్ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. సురేష్ చెయ్యి విరిగి మెడపై బలమైన దెబ్బలు తగిలాయి. గ్రామస్థులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెయ్యి విరిగి, మెడ వద్ద బలమైన గాయమైనట్లు నిర్ధారించి, మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం రిఫర్ చేశారు. దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త సురేష్‌ను దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బొబ్బర్లంక టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దొప్పలపూడి జగదీష్, కోనేరు నాని పరామర్శించారు. గతంలో గ్రామంలో వివాదాలకు సంబంధించి ముద్దాయిలుగా శివకుమార్, నవీన్ ఉండగా, గ్రామస్థులు వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ముమ్మనేని అరవింద్ కొక్కిలిగడ్డ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చి శివకుమార్, నవీన్ అనే వ్యక్తులు త్వరలో తనను చంపేస్తారని వార్నింగ్ ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆవేదన వ్యక్తం చేశాడు.



కృష్ణా కరకట్టపై ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● కరకట్టపై టీడీపీ శ్రేణుల బైఠాయింపు

బొబ్బర్లంక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సురేష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై రౌడీషీట్ ఓపెన్‌చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ శ్రేణులు కృష్ణా కరకట్టపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మోపిదేవి ఎస్సై వైవి.సత్యనారాయణ, పోలీసు ఉన్నతాధికారులు కరకట్టపై ఆందోళన చే స్తున్న టీడీపీ కార్యకర్తల వద్దకు వచ్చి ఆందోళన విరమించాల్సిందిగా కోరారు. రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకునేవరకూ విరమించేదిలేదంటూ గ్రామస్తులు నినాదాలు చేయగా, పోలీసుల హామీతో ఆందోళన విరమించారు.

నైపుణ్యం పెంపుతోనే ఎదుగుదల

ఉంగుటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభా పాటవాలతోపాటు నైపుణ్యం పెంపుతోనే ఏ రంగంలోనైనా రాణిస్తారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని స్వశక్తి గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జిల్లా లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ సహకారంతో ఆగస్టు 28న ప్రారంభమైన ట్రావెల్ అండ్ టూరిస్ట్ గైడ్ శిక్షణ శనివారంతో ముగియనున్న నేపథ్యంలో కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులనుద్దేశించి మాట్లాడారు. ట్రావెల్, టూరిజం రంగాల్లో నైపుణ్యాలు మెరుగుపరచుకున్న అభ్యర్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఔత్సాహికులకు టూరిజం, ట్రావెల్ గైడ్ అంశాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తేవడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. నవ్య రాజధాని అమరావతికి ముఖద్వారమైన విజయవాడ, ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ కేంద్రం(యూబీఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్ వి.అమరేశ్వర్‌రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఏ.శిల్ప, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షణా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో మాట్లాడుతున్న ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ

బోధనలో మార్గదర్శకులు

● ఉత్తమపౌరుల రూపకల్పనకు శక్తివంచన లేకుండా కృషి ● విద్యా బోధనలో నిత్యకృషీవలురు

విద్యాబోధన ఒక మహత్తర అవకాశం. ఉత్తమ పౌరుల రూపకల్పనలో వారు నిత్యకృషీవలురు. ప్రభుత్వ పాఠశాలల పట్ల మక్కువ తగ్గుతున్న నేటి రోజుల్లో గుడివాడలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ముగ్గురు ఉపాధ్యాయులు తమ గురుతర బాధ్యతను నెరవేర్చి తల్లిదండ్రులు, పిల్లల మనస్సుల్లో మంచి స్థానం సంపాదించుకున్నారు. ఉపాధ్యాయులంటే ఇలా ఉండాలి.. అనేలా పలువురికి స్ఫూర్తిగా నిలిచిన ఉపాధ్యాయులు కురాకుల పవన్‌కుమార్, పెడసనగంటి ఉషారాణి, ఐ.అరవిందబాబు సక్సెస్ స్టోరీ ఇది..

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

విద్యార్థుల సంఖ్యను 30 నుంచి 525కు చేర్చిన పవన్‌కుమార్



కురాకుల పవన్ కుమార్ 2008 డీఎస్సీలో నెగ్గి గౌరీ శంకరపురంలోని గుడివాడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల(పార్కు స్కూల్)లో ఎస్జీటీగా చేరారు. 2015లో ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు తీసుకునే నాటికి పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కేవలం 30 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పవన్ తన బృందంతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని ప్రచారం చేయడంతో సత్ఫలితం వచ్చిం ది. పవన్ బృందం కృషి ఫలితంగా విద్యార్థుల సంఖ్య 525కి చేరింది. విద్యార్థులక సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ పాలకవర్గంపై ఒత్తిడి తీసుకువచ్చి ఉపాధ్యాయులను రప్పించుకున్నారు. పాఠశాల గదులు తక్కువగా ఉన్నా, విద్యాబోధన బాగుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు ఆసక్తి చూపడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సొం త ఖర్చుతో ఆటోలను పవన్ మాస్టారు ఏర్పాటు చేశారు. అంతే బాధ్యతగా విద్యార్థులందరూ ఇళ్లకు చేరే వరకు పాఠశాలలోనే ఉండేవారు. ఇదే సంఖ్య 2019 వరకు కొనసాగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో ఉన్న భవనాలను కూల్చి కొత్త భవనాల నిర్మాణం చేపట్టి మధ్యలో వదిలేశారు. దీంతో 2024 నాటికి విద్యార్థుల సంఖ్య సగానికి పడిపోయింది. పట్టణ పరిధిలో జరిగే పోటీ పరీక్షలు, సాంస్కృతి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేసి తీసుకువెళ్లే వారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పేద విద్యార్థులను ఐఐటీయన్లుగా తమారు చేసేందుకు అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో చేరాలంటే ప్రవేశ పరీక్ష తప్పనిసరి. దీనిని దృష్టిలో పెట్టుకుని పవన్ విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించారు. ప్రతి ఏటా 6వ తరగతిలో 40 మందికి గాను సగానికి పైగా పార్కు స్కూల్ విద్యార్థులు అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ పాఠశాలలో ప్రవేశం పొందేవారంటే అతిశయోక్తి కాదు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతిలో భాగంగా ఈ ఏడాది జూన్‌లో ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలకు పవన్ బదిలీపై వెళ్లారు.

ప్రత్యేక తరగతులతో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉషారాణి



పెడసనగంటి ఉషారాణి 2008 డీఎస్సీలో ప్రతిభ చూపి పెద్దవీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (సంఘం బడి)లో ఎస్జీటీగా బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతి లో విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. వెనుకబడిన విద్యార్థుల కోసం సా యంత్రం 6గంటల వరకు ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించేవారు. భర్త సహకారంతో పాఠశాలకు దగ్గరలోనే నివాసముండటంతో ప్రత్యేక తరగతుల నిర్వహణ సాధ్యమైనట్లు ఉషారాణి తెలిపారు. పాఠశాలలో జాతీయ దినాలతో పాటు ప్రతి పండుగను నిర్వహించేవారు. దీని కోసం ఆయా పండుగల ప్రత్యేక వంటకాలను స్వయంగా తయారు చేసి విద్యార్థులకు వడ్డించేవారు. ముఖ్యంగా బాలి కా విద్యపై తల్లిదండ్రులను ప్రోత్సహించే వారు. వారి కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టేవారు. పట్టణ పరిధిలో జరిగే పోటీ పరీక్షలు, సాంస్కృతిక పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేసి తీసుకువెళ్లే వారు. 2025 జూన్ వరకు సంఘం బడిలోనే ఉపాధ్యాయురాలిగా పని చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం అందించిన అరవింద్‌బాబు



ఐ.అరవింద్‌బాబు రాజేంద్రనగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 2019లో ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు తీసుకునే నాటికి పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉ న్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఇం టింటికి తిరిగి అవగాహన కల్పించారు. 2021 నా టికి విద్యార్థుల సంఖ్య 96కి చేర్చారు. ఆటో సౌక ర్యం లేని ప్రాంత విద్యార్థులను తన ద్విచక్రవాహనంపై వారి ఇంటి వద్ద దించేవారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆటోలను సొంత ఖర్చుతో పెట్టారు. విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, మ్యూజిక్ కీ బోర్డును నేర్పేవారు. మూడో తరగతిలోనే గేయాలకు స్వరం కట్టి తాను పాడుతూ విద్యార్థులతో పా డించేవారు. పాఠశాల కాంప్లెక్స్‌లో రిసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనులతో తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య 36కి పడిపోయింది. విద్యార్థుల సంఖ్య పడిపోవడం పట్ల అరవింద్‌బాబు విచారం వ్యక్తం చేశారు.



పవన్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు(ఫైల్)





ఉషారాణి బోధనలో అవగాహనలో పాల్గొన్న విద్యార్థి (ఫైల్), కీబోర్డు నేర్పిస్తున్న అరవింద్‌బాబు (ఫైల్)

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్‌గా 'కొదమల'

గుడివాడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్‌గా గుడివాడకు చెందిన కొదమల గంగాధరరావును నియమించినట్లు రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొదమల ఎంపిక పట్ల నాయకులు గంథం సైమన్‌బాబు, అద్దంకి మాణిక్యాలరావు, వంగిపురపు కిరణ్, చాట్ల పవన్, కలపాల బాబురావు, జుజ్జవరపు ప్రశాంతి, రాజు, తాళ్లూరి ప్రశాంత్, కాటూరి శ్రీనివాసరావు, పసలాది శేఖర్, మద్దాలి ఇస్సాక్, కార్తీక్, అజయ్, ప్రసాద్ తదితరులు అభినందించారు.

దేవాలయాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని , ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఘంటసాల నాగభూషణం సత్రం, స్థానిక కాకర్ల వీధిలోని వేణుగోపాల స్వామి దేవస్థానం ధర్మకర్తల కమిటీల ప్రమాణస్వీకారం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా కమిటీల సభ్యులతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రమాణస్వీకారం చేయించారు. వేణుగోపాల స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా అంగడాల సతీష్, సభ్యులుగా మరీదు సీతారామయ్య, కాజా శ్రీనివాస్, కొల్లిపర అంజనేయులు, చంద్రశేఖర్, దుర్గా పద్మజ, నాగమణి, పతకమూరి శాంతిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఘంటసాల నాగభూషణం సత్రం కమిటీ ఛైర్మన్‌గా ఘంటసాల అరవింద్, సభ్యులుగా నీలం విజయలక్ష్మీ, మేఘన సాయి, దేసు వెంకట సురేష్‌కుమార్, తెన్నేటి పాణేశ్వరరావు, వెంకట వరలక్ష్మీ, పువ్వుల సునీత, గోగండి నాగమణి, వంగలపూడి మాధవిలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల ధర్మకర్తలు దేవస్థానాల వైభవాన్ని మరింత పెంపొందించేలా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, రామినేని వెంకటకృష్ణ, తాతినేని శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, గోకవరపు సునీల్, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి దేవస్థాన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



ఘంటసాల నాగభూషణం సత్రం కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వ దుర్మార్గపు మెమో నెం.1214ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే మెటీరియల్ రేట్లు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రేపాని కొండ, గుడివాడ కమిటీ గౌరవాధ్యక్షుడు బాబ్జీ, బండలి సత్యనారాయణ, ఓలేటి సీతారామయ్య, రామనాథం రామకృష్ణ, రాము, దాసు శ్యాంప్రసాద్, సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం ఐలూరు శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు ప్రమాణ స్వీకారం శుక్రవారం సాయంత్రం జరిగింది. దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా అప్పికట్ల వెంకటస్వామి, ట్రస్టీలుగా లోయ అన్నపూర్ణ, తమ్మన వీర నాగరాజు, ఐలూరు లీలా ప్రసాద్, దావులూరి హరిబాబు, భవిరిశెట్టి వెంకట పద్మావతి, కొప్పూరి ధనమ్మ, ఇంటూరి శ్రీనివాసరావు, లోయ రాజ్యలక్ష్మిల చేత దేవస్థానం ఈవో వివిఎస్ గోపాలరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ట్రస్టుబోర్డు సభ్యులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, పీఏసీఎస్ ఛైర్మన్ దావులూరి చినబాబు, కుటుంబయ్య శాలువాలు, పూలమాలలతో అభినందించారు. భక్తులకు మంచి సేవలందించాలని ఎమ్మెల్యే సూచించారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



ఐలూరు శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డుని అభినందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా, గురుమూర్తి

పమిడిముక్కల : పేద, బడుగు, బలహీన వర్గాలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం చేస్తూ చంద్రబాబునాయుడు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కపిలేశ్వరపురానికి చెందిన బొమ్మన బోయిన ప్రసాద్‌కు రూ. 44,581, గూడవల్లి సీతకు రూ. 17,684, సయ్యద్ హబీబున్నీసకు రూ. 56,652, సత్యవోలు వీరమ్మకు రూ. 20,000, పమిడిముక్కలకు చెందిన గురువిందపల్లి వెంకటేశ్వరరావుకు రూ. 40,350 మంజూరు కాగా శుక్రవారం చెక్కులను లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక నాయకులు కొల్లిపర బాబీ, జక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనాలు



బాలగణపతిని దర్శించుకున్న ఇంటిలిజెన్స్ సీఐ రామకృష్ణ

గుడివాడ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరులో శుక్రవారం గణేశ్ విగ్రహాలకు పూజలు నిర్వహించి అన్నసమారాధన కార్యక్రమాలు ఎమ్మెల్యే, స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య అతిథిగా విచ్చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మురళీ, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ శ్రీకాంత్, జగన్మోహనరావు పాల్గొన్నారు.

స్థానిక ఎన్టీఆర్ కాలనీ శివారు గణేష్ నగర్‌లోని త్రిశక్తి త్రిమూర్తి స్వరూప శ్రీసిద్ది వినాయక ఆలయంలో శుక్రవారం నిర్వహించిన శ్రీగణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా వేలంపాటలో ఉత్సవ లడ్డూలను దక్కించుకున్న భక్తులకు లడ్డూలను ఆయన అందజేశారు. ఎన్‌టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినయక ఉత్సవాల్లో పూజలు అందుకొంటున్న గణపయ్యను శుక్రవారం రాత్రి నిమజ్జనం చేశారు. తీన్‌మార్ డప్పులు, యువకుల నృత్యాలు, డీజే సౌండ్‌లతో, బాణాసంచా పేలుస్తూ హోరెత్తించారు. అనంతరం పుల్లేరులో నిమజ్జనం చేశారు.

గుడివాడ : స్థానిక శ్రీరాంపురంలో వేంచేసియున్న బాలగణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఇంటిలిజెన్స్ సీఐ ఏవీఎస్ రామకృష్ణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు పొన్నా మల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో కోలాహలంగా గణపతి నిమజ్జన ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి



డోకిపర్రులో జండా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

గుడివాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త 1500వ జన్మదిన వేడుకలను గుడివాడలో ఘనంగా నిర్వహించారు. ఈద్ మిలాద్-ఉన్-నబి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం పార్టీలకతీతంగా ముస్లిం మత పెద్దలు, యువకులు, మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏర్పాటు చేసిన మక్కా మదీనా ప్రతిమలు ఆకట్టుకున్నాయి. మహ్మద్ ప్రవక్తను కీర్తిస్తూ ఆయన గొప్పతనాన్ని చాటుతూ ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.

కూచిపూడి: ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను కాజలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిడుమోలు, కాజ, భట్లపెనుమర్రు, పెదపూడి తదితర గ్రామాల్లో ఈ వేడుకలు జరిగాయి. కాజలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మతిన్, ఇమామ్ ఉమర్ బేగ్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని డోకిపర్రు తురాయిపాలెం మసీదువద్ద మిలాద్ ఉన్ నబి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తురాయిపాలెం మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అన్నదానం చేశారు. మసీదు నిర్వాహక కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కాజాలో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఉచిత వైద్య శిబిరం నేడు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్ వెంకటరావు ఆధ్వర్యంలో శనివారం,ఆదివారం రెండు రోజులు ఉచిత వైద్యశిబిరాలను స్థానిక సీఎల్ వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. దంత,గుండె,ఎముకలు,సాధారణ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ లకు సంబంధించిన వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

సీపీఎం నేతల శ్రమదానం

కూచిపూడి : చినముత్తేవికి చెందిన సీపీఎం నేతలు రావూరి అజయ్ కుమార్ - విజయలక్ష్మిల వర్ధంతిని పురస్కరించుకుని గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు శ్రమదానం నిర్వహించారు. పీహెచ్‌సీ సబ్ సెంటర్ నుంచి జడ్పీ హైస్కూల్ వరకు పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు తొలగించి రోడ్లను పరిశుభ్రపరిచారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ - విజయలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీపీఎం నేతలు వెంకటేశ్వరరావు, శివనాగేంద్ర, రామచంద్రరావు, బసవయ్య, గంగాధర్‌రావు పాల్గొన్నారు.

హామీలు నేరవేర్చడంలో కూటమి విఫలం : కైలే

పామర్రు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయడం దారుణమని ఆయన విమర్శించారు.

యూరియా కొరతపై ఆందోళన చెందొద్దు

● కలెక్టర్ డీకే బాలాజీ

పామర్రు,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతపై రైతులు ఏమాత్రం ఆందోళన చెందనవసరం లేదని, రైతుల అవసరం మేరకు సమృద్ధిగా యూరియాను అందించేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం జుజ్జువరం, కురుమద్దాలి, కనుమూరు గ్రామాల్లో యూరియా సకాలంలో అందక ఆందోళనతో సమతమతమవుతున్న రైతుల ఇబ్బందులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటన ద్వారా రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని వ్యవసాయ సొసైటీలో రైతులకు అవసరమైన యూరియా అందించేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా కౌలు రైతులు అవసరమైన గుర్తింపు కార్డుల జారీలో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వానికి నివేదికలు పంపించి తగు చర్యలు తీసుకోనున్నామని రైతులకి ఆయన హామీ ఇచ్చారు. పైరుకు అవసరం మేరకే ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు.



రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బాలాజీ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి లక్ష్యమని డీసీ ఛైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యచౌదరి తెలిపారు. టీడీపీ కౌతవరం గ్రామ సర్వసభ్య సమావేశం శుక్రవారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీటీకేవీ సుబ్బారావు స్వగృహంలో ఆయన అధ్యక్షతన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామానికి చేసిన అభివృద్ధి చేయనున్న పనుల వివరాలపై చర్చించి ,సూపర్ సిక్స్ అమలు తీరులను సమావేశంలో కొనియాడారు. పీఏసీఎస్ ఛైర్మన్ నియామకం, కండాలమ్మ తల్లి బోర్డు నియామకం పట్ల హర్షం వ్యక్తంచేశారు. గౌతమేశ్వరాలయం, చెన్నకేశవ స్వామి ఆలయాల ట్రస్టీబోర్డులు త్వరగా నియమించాలని , యూరియా సరఫరా రైతులకు సకాలంలో అందించాలని కోరారు. కార్యక్రమంలో కౌతవరం పీఏసీఎస్ ఛైర్మన్ వడ్లమూడి యుగంధర్, శంకర్, నాన్‌జీ, శివాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గురుపూజోత్సవం



ప్రొఫెసర్ అనీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

గుడివాడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక విద్యావికాస్ పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావును పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాల ప్రై మరీ ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం, హైస్కూల్ హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక టైలరింగ్ స్ట్రీట్‌లో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.అరవింద్‌బాబు, టి.నాగమణి, షేక్ నూర్జహాన్, పి.ఉషారాణి, బి.ఎన్ రాజేశ్వరీలను ఘనంగా సత్కరించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికుమార్, తాతారావు, వెంకటేశ్వరరావు, బాలాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల భౌతిక శాస్త్రవేత్త కొడాలి అనీల్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్‌ఆర్‌కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ఉపాధ్యక్షుడు రాజభూషణరావు, కోశాధికారి కృష్ణప్రసాద్, సంయుక్త కార్యదర్శి కొల్లి రమణకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వర్ణవాహిని సత్కరిస్తున్న కోటక్ మహీంద్రా సంస్థ ప్రతినిధులు

స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు యెనిగళ్ల జ్యోతి, పొట్లూరి రమాదేవిలు, మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ శాఖ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, ఉమ్మడి జిల్లా పర్యావరణ కమిటీ ఛైర్మన్ దండమూడి జయలక్ష్మీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సమన్వయ కమిటీ ఛైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, గుడివాడ ఛైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు చోడవరపు కుసుకుమార్,దిండిభట్ల సత్యనారాయణమూర్తి, రూపవతిలను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, డైరెక్టర్ చోడవరపు సుజాత, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఏజీకే షటిల్ కోర్టు సభ్యులు ఎం.అమ్మన్నబాబు, టి.అప్పారావులను కోర్టు సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈడే వెంకటేశ్వరరావు, ఈడే శ్రీనివాసరావు, కె.ఎల్ శ్రీనాద్, కె.చంద్రశేఖరరావు, వి.మురళీ, కె.సతీష్, హుసేన్‌పాషా,రాజేష్, పాండు, కె.పవన్‌కుమార్, గోపాల్, శివశ్రీ, నాగరాజు, హరిబాబు, దాశరధి, శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రు : విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి సమాజానికి ఉత్తమ పౌరులను అందిస్తున్న ఘనత ఉపాధ్యాయులేనని వారిని సత్కరించుకోవడం మన అందరి బాధ్యత అని కోటక్ మహేంద్ర సంస్థ కల్చరల్ విభాగపు ఏఐ ఏపీ.రామారావు అన్నారు. విజయవాడకుచెందిన ఆసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల పరిధిలోని కురుమద్దాలి ఎంయుపీ పాఠశాల ఉపాధ్యాయురాలు దండే స్వర్ణవాహిని దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోటక్ మహేంద్ర సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏజీకే షటిల్ కోర్టు సభ్యులు

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు సూరపనేని పరంధామయ్య, గుడ్లవల్లేరు ఎస్‌సీఎస్ డిగ్రీ కళాశాల విశ్రాంత ఉపాధ్యాయులు డాక్టర్ పోలవరపు రాజశ్రీ , విశ్రాంత ప్రధానోపాధ్యాయరాలు నిమ్మగడ్డ శశికళలను క్లబ్ సభ్యులు సన్మానించారు.క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లరావు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, సభ్యులు, జంగం మోహనరావు, పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



రాజశ్రీని సన్మానిస్తున్న లయన్స్ ప్రతినిధులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

మోపిదేవి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భీమవరానికి చెందిన ఆకుల వీరాస్వామిరాజు- పద్మజ దంపతులు రూ.1,00,116 విరాళముగా అందజేశారు. శుక్రవారం కుటుంబసమేతంగా స్వామిని వారు దర్శించుకున్నారు. నగదును ఆలయ సూపరింటెండెంట్ బి.సత్యనారాయణకు అందజేశారు.



దాతలకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారి



అవనిగడ్డలో విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కూటమి నేతలు



చల్లపల్లిలో జనసేన ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

అవనిగడ్డ/చల్లపల్లి/నాగాయలంక/బంటుమిల్లి/మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎం.వి.కృష్ణారావు విగ్రహానికి విశ్రాంత ఉపాధ్యాయులు గుడిసేవ విష్ణుప్రసాద్, కూనపరెడ్డి చంద్రశేఖర్, బడే వెంకట సుబ్బారావు, అన్నపరెడ్డి నాగ చెంచయ్య, విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, సీహెచ్ రాఘవులు నివాళులర్పించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులను కూటమి నాయకులు సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, గాంధీక్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మాదివాడ రత్నారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు సేవాభావాన్ని పెంపొందించిన విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావును సన్మానించారు. ఉరిమి మణికాంత్, మోటుపల్లి రత్నకుమారి, అడ్డాడ ప్రసాద్‌బాబు, ఉప్పల నాంచారయ్య, రావి రాజశేఖర్, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, చేతన్, జిలానీ, సిద్ధాబత్తుల వాసు పాల్గొన్నారు. చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పీవీ మాధవేంద్రరావు నివాళులర్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, పైడిపాముల రాజేంద్ర, హరి, రిరేష్ పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో ఉపాధ్యాయులుగా పనిచేసి, పదవీవిరమణ చేస్తున్న ఉపాధ్యాయులు కైతేపల్లి దాస్, జి.వి.తాతారావు, విజయరమ, తోట శివపార్వతి, అడపా గురవయ్య, నారంశెట్టి వెంకటేశ్వరరావు, నాంచారయ్య, షాహీన, నాగేశ్వరరావును సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ బోలెం నాగమణి, సొసైటీ చైర్‌పర్సన్ బొందలపాటి వీరబాబు, జనసేన నేతలు అడపా రాంబాబు, మిరియాల జితేంద్ర, ఎం.రంజిత్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. బంటుమిల్లి కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్లో డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఉపాధ్యాయులను యాజమాన్యం సత్కరించింది. మచిలీపట్నంలో గాంధీ విద్యాలయం, నారాయణ స్కూల్, నాగార్జున పబ్లిక్ స్కూల్, బాలాజీ విద్యాలయం, స్టార్ ప్లస్ స్కూల్, ఈకే బాలభాను పాఠశాలల్లో గురుపూజోత్సవాలు జరిగాయి.

సుజాతకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు

నాగాయలంక: మచిలీపట్నంలో నిర్వహించిన ఉపాధ్యా య దినోత్సవ కార్యక్రమంలో నా గాయలంక జడ్పీ పాఠ శాల ప్లస్ స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) ఆరవ సుజాత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, జేసీ గీతాంజలి శర్మ, డీఈవో పీవీజే రామారావు తదితరులు ఆమెను సత్కరించారు.



ఆరవ సుజాతకు అవార్డు అందించి సత్కరిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్







మచిలీపట్నం, పెడన, గూడూరులో ర్యాలీలు చేస్తున్న ముస్లింలు





మచిలీపట్నంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాజుపేటలో వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



బంటుమిల్లిలో ముస్లింల మానవహారం

మచిలీపట్నం టౌన్/పెడన/గూడూరు/బంటుమిల్లి/ చల్లపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామియా మసీదు నుంచి కోనేరుసెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, ఎండీ ఇలియాస్ పాషా, అజీమ్ పాల్గొన్నారు. కోనేరుసెంటర్‌లో మత పెద్దలు సందేశమిచ్చారు. గూడూరులో పఠాన్‌పేట దర్గా నుంచి జామియా మసీదు మీదుగా చిన్న మసీదు వరకు ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గూడూరు డీసీ చైర్మన్ పోతన స్వామి, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, దర్గా కమిటీ చైర్మన్ ఎండీ యాసిన్, జమాలుద్దీన్, మత గురువులు జినత్ రజా, ఎండీ జమాల్ బేగ్, అబ్దుల్ అలీం, ఎస్ఏ బేగ్, ఎండీ బషీర్, ఎంఏ సలీం, ఎండీ ఇస్మాయిల్, ఖుద్దుస్, సమద్, జహీర్, మొహిద్దీన్, జలీల్ పాల్గొన్నారు. పెడనలో ముస్లింలు భారీ ప్రదర్శ న నిర్వహించారు. గుడివాడ రోడ్డులోని జామియా మసీదు నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన ప్రధాన రహదారి మీదుగా మచిలీపట్నం రోడ్డులోని రైల్వేగే టు వరకు కొనసాగి తిరిగి జామియా మసీదు వద్ద కు చేరుకుంది. అనంతరం గుడివాడ రోడ్డులోని షాదీఖానాలో సభ నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ మత గురువులు ప్రసంగాలు చేశారు. ముస్లిం ప్రముఖులు అబ్దుల్ ఖదీర్, అయూబ్‌ఖాన్, రహమాన్ బేగ్, ఎండీ ఖాజా పాల్గొన్నారు. బంటుమిల్లిలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం పురవీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఎండీ కమల్, ఎండీ నజీర్, ఎండీ అక్బర్, అలీమ్, మహబూ, ఆదిల్‌బాషా, సూరజ్ బాషా, నూర్, మత గురువులు పాల్గొన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని చల్లపల్లిలో ముస్లింలు ఇస్లాం పతాకంతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మతగురువులు మిలాద్ ఉన్ నబీ విశిష్టతను, ప్రవక్త బోధనలను వివరించారు. పెద్దమసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీం షెరీ, అహ్మద్ జానీ, మీర్ రిజ్వాన్, అబ్దుల్ అర్షద్, మహ్మద్ హుస్సేన్, సుభానీ, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.



చేకూరి వెంకట్రావును అభినందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

నాగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా చేకూరి వెంకట్రావు

కృత్తివెన్ను, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా చేకూరి వెంకట్రావు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పాలకవర్గంతో కలిసి స్వామికి పూజలు చేశారు. దేవదాయ శాఖ మచిలీపట్నం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసరావు సమక్షంలో దేవస్థానం చైర్మన్‌గా చేకూరి వెంకట్రావు, ధర్మకర్తలి మండలి సభ్యులుగా ఈద సౌదామణి, మోక దుర్గ నాగజ్యోతి, బాలం శ్రీనివాసరావు, తమ్ము లక్ష్మి, దాసరి వెంకటశ్రీనివాస్, బాడిత నాగబాబు, నూతలపాటి రేవతి, మల్లువలస మహాలక్ష్మి, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా కోట మురళీకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. పాలకవర్గాన్ని ఎమ్మెల్యే దంపతులు సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, నెక్కంటి భాస్కరరావు, పిన్నెంటి రత్తయ్య, కూనసాని చిన్నా, యాదం రెడ్డి కొండ, నాగిడి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

వ్యక్తిగత తగాదాలను టీడీపీకి ఆపాదిస్తున్నారు

● వైసీపీ నాయకులపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంకలో బిల్‌కలెక్టర్ కైతేపల్లి వెంకటేష్‌పై జరిగిన దాడి వ్యక్తిగత తగాదాల వల్లేనని వైసీపీ నాయకులు దానిని పార్టీ తగాదాగా చిత్రీకరించి టీడీపీకి ఆపాదిస్తున్నారని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలు టీడీపీకి అండదండలుగా ఉంటున్నారని, దీన్ని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి దుష్ప్రచారాలను టీడీపీ నాయకులు తిప్పికొట్టాలని కొనకళ్ల పిలుపునిచ్చారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి దుర్మరణం

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ- కోడూరు ప్రధాన రహదారిపై శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి బైక్ నడుపుతున్న వ్యక్తి దుర్మరణం చెందారు. విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన బత్తుల నాగరాజు(46) అవనిగడ్డ వెళ్లి వస్తుండగా, రామచంద్రాపురం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయమైంది. దీంతో అక్కడికక్కడే నాగరాజు మృతి చెందాడని స్థానికులు తెలిపారు. అవనిగడ్డ ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాసవీక్లబ్‌ల ఆధ్వర్యంలో పేదలకు సాయం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్, వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. వాసవీ క్లబ్ వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ముగ్గురు పేపర్ బాయ్స్‌ను సత్కరించారు. శ్రీపాద ఫంక్షన్ హాలులో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధినేత యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, అన్నం అశోక్, జల్లూరి దివ్యశ్రీ, తూముగుంట్ల రంగనాయకులు, తమ్మన అనూరాధ, జల్లూరి రాంబాబు, జయవరపు ప్రసాద్, ఆర్.పూర్ణ, ఎ.సంగీత, తమ్మన ప్రసాద్, చిట్టా రవి, అశోక్ పాల్గొన్నారు.

కృష్ణానది పాయలో మృతదేహం

చల్లపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిమ్మగడ్డలో కృష్ణానది పాయలో శుక్రవారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. నదిలో కొట్టుకువచ్చిన మృతదేహం నిమ్మగడ్డ వద్ద ఎత్తిపోతల పథకం సమీపానికి చేరడంతో గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై బ్లూ కలర్ ప్యాంటు, బిస్కెట్ రంగు చారల చొక్కా, చేతి వేళ్లకు వెండి పడగ ఉంగరం, వెండి వేంకటేశ్వరస్వామి ఉంగరం ఉన్నాయి. 45 - 50 ఏళ్ల లోపు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. గుర్తుపట్టేందుకు వీల్లేని విధంగా ముఖం, శరీరం పూర్తిగా పాడైపోయాయి. మరణించి రెండు వారాలకు పైగా అయి ఉంటుందని భావిస్తున్నారు. వీఆర్వో పెనుమూడి వెంకటేశ్వరరావు శవపంచనామా నిర్వహించారు. చల్లపల్లి ఎస్సై పీఎస్వీ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రి వైద్యులు సంఘటనా ప్రదేశానికి వచ్చి మృతదేహానికి శవపరీక్ష నిర్వహించారు. అనంతరం ఖననం చేశారు.







పెడనలో హిందూ బంధువుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిమజ్జన ఊరేగింపు, మోదుమూడిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

గణనాథుడికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్: నగరంలోని వినాయక చవితి పందిళ్లలో శుక్రవారం గణపతిని వివిధ రూపాల్లో అలంకరించారు. గానుగకొట్టు సెంటర్‌లో గణపతిని పత్రితో, పూలతో అర్చించారు. అన్నసమారాధన జరిపారు. ఆర్టీసీ కాలనీలో వినాయక పందిరి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. గొడుగుపేట, రాజుపేట, భాస్కరపురం ప్రాంతాల్లోని వినాయక పందిళ్ల వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాజుపేట పందిరిలో జబర్దస్త్ టీమ్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఆర్టీసీ కాలనీలోని వినాయక పందిరిలో కొల్లు నీలిమను సత్కరిస్తున్న భక్తులు

ఘనంగా గణనాథుని నిమజ్జనాలు

అవనిగడ్డ రూరల్/పెడన, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలో స్టార్ గోల్డ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మోదుమూడిలో రామాలయం, ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వేలంలో స్వామి లడ్డూ రూ.36,100 పలికింది. పెడన బస్టాండ్ సెంటర్‌లోని గణపతి ఆలయానికి చెందిన నిమజ్జన ఊరేగింపు హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఆలయ ఆవరణలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిమజ్జనోత్సవం ప్రారంభించారు. అనంతరం వినాయకుడిని రామరాజుపాలెం కాలువలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి హిందూ బంధువుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు నేతృత్వం వహించారు.



నాగాయలంకలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సామూహిక కుంకుమ పూజలు

నాగాయలంక: ప్రసన్న గణపతి స్వామి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో 10వ రోజు శుక్రవారం మానేపల్లి శ్రీనివాసరావు-పద్మజ ఆధ్వర్యంలో 108 కలశాలకు సామూహిక శ్రీలక్ష్మీ అమ్మవారి కుంకుమ పూజలను మహిళలు నిర్వహించారు. చిట్టా నారాయణరావు ఆర్థిక సహకారంతో పూజల్లో పాల్గొన్న మహిళలకు లక్ష్మీ రూపులను అందజేశారు. అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన భాగవతారిణి పి.విజయలక్ష్మి చెప్పిన రుక్మిణీ కల్యాణం హరికథ భక్తులను ఆకట్టుకుంది. మండవ బాలవర్థిరావు, గడ్డిపాటి ప్రసాద్, సుఖవాసి యుగంధర్, విస్సంశెట్టి రాము, తోపుల బాబురావు, తలశిల తాతయ్య, గోలి సత్యనారాయణ, చిట్టా సాంబశివరావు పర్యవేక్షించారు. నంగేగడ్డలో వినాయక చవితి నవరాత్రులు జరుగుతున్నాయి. శుక్రవారం పదో రోజున సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. వేలాది మందికి అన్నసంతర్పణ జరిగింది.

ఘనంగా విఘ్నేశ్వరుని కల్యాణం

కోడూరు: లింగారెడ్డిపాలెంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో విఘ్నేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చింతా పాండురంగారావు దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అచ్చెంపాలెం సర్పంచ్‌కు
టీడీపీ నేతల పరామర్శ

ఘంటసాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు ఇటీవల విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో తొంటికు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను టీడీపీ నేతలు పరుచూరి సుభాష్‌చంద్రబోస్, యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని శివరామప్రసాద్, రామకృష్ణలు శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

ప్రథమ చికిత్స కిట్లు అందజేత

అవనిగడ్డ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగార్జున నర్సింగ్ హోమ్ (రేపల్లె) ఆధ్వర్యంలో డాక్టర్ వల్లభనేని కృష్ణ చైతన్య అవనిగడ్డ ఆర్టీసీ డిపోకు ప్రథమ చికిత్సకు అవసరమైన మందుల కిట్లను అందజేశారు. వాటిని డిపో మేనేజర్ హనుమంతరావుకు ఆయన అందించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను కండక్టర్ దగ్గర ఉండేలా ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.దివ్య పాల్గొన్నారు.



గొర్రెపాటి గోపీచంద్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గొర్రెపాటి గోపీచంద్‌కు సత్కారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ పలువురిని నాయకులుగా తీర్చిదిద్దిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్‌ను శుక్రవారం ఆయన ఇంటి వద్ద కార్పొరేటర్ దేవరపల్లి అనిత, టీడీ పీ నాయకులు పీవీ ఫణికుమార్, ఫిరోజ్ తదితరులు ఘనంగా సత్కరించారు. రాజకీయాల్లో యువకులు, కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి నాయకులుగా గోపీచంద్ తీర్చిదిద్దారని వారు కొనియాడారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బంటుమిల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందుతున్న కొర్లపాడు గ్రామానికి చెందిన తోకల నాగబాబుకు మంజూరైన రూ.2,56,000 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం అందజేశారు. కొర్లపాడు టీడీపీ నాయకుడు యలవర్తి నాగరాజు, డీసీ చైర్మన్ కాశీ పాల్గొన్నారు.

దాత సహకారంతో పాఠశాల అభివృద్ధి పనులు

మోపిదేవి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉపాధ్యాయుడు రావి దుర్గా సుధాకర్‌రెడ్డి(రెడ్డి మాస్టారు) తన సొంత ఖర్చుతో పెదకళ్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టారు. గురుపూజోత్సవం సందర్భంగా పాఠశాలలో తాగునీటి, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేందుకు రూ.20 వేలు ఖర్చు చేసి పనులు ప్రారంభించారు. వాటర్ ట్యాంక్ మర్మతులు చేయించారు. పైపులైన్లు, డ్రెయినేజీ పనులను చేయించారు. ఈ కార్యక్రమా లను ప్రధానోపాధ్యాయుడు కొల్లూరి మోహన్‌రావు పర్యవేక్షించారు.